



పిప్పర్‌వాడలో పుస్తకావిష్కరణలో పాల్గొన్న కలెక్టర్

విద్యార్థులు పుస్తకాలు చదవండి

● పుస్తకావిష్కరణలో కలెక్టర్ రాజర్షిషా

జైనథ్, జూలై 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా పాఠశాలల విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని, భవిష్యత్తులో పుస్తక పఠనం ద్వారా విద్యార్థులను అగ్రగణ్యులుగా నిలుపుతుందని కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. శనివారం జైనథ్ ఉమ్మడి మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో గల అభ్యుదయ పాఠశాలలో కథ రచయిత మురళీధర్ రాసిన 'మౌనం ఎరుపు' అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దీంతో పాటు ఇటీవల హిందీలోకి అనువాదమైన మోర్‌పంఖిఫెడ్ పుస్తకాన్ని పాఠశాల యాజమాన్యం సభ్యులు రాధాకృష్ణ, వెంకటరమణలు ఆవిష్కరించారు. జిల్లా సంస్కృతి, భౌగోళిక విశిష్టతలను ప్రతిపాదించే సాహిత్యాన్ని ప్రతీఒక్కరు చదవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమలో జిల్లా రచయిత ఎస్.రాజవర్ధన్, మన్నెఏలియా, చిందం ఆశన్న, చరణ్ దాస్, టీఎన్‌జీవో అధ్యక్షుడు అశోక్, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు తలమడుగులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

తలమడుగు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ ఈనెల 13న ఆదివారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలో ఆవిష్కరించడం జరుగుతుందని మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు హాజరవుతున్నారని తెలిపారు. తలమడుగుకు చెందిన వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త కాటిపల్లి వసంత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి వారి ఆర్థికసాయంతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో అంబేద్కర్ సంఘ నాయకులు మండలవాసులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

తాంసిలో అకాడి బోనాలు

తాంసి, జూలై 12(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం కంటే ముందు ప్రతీ సంవత్సరం అకాడి బోనాలు వేయడం తాంసిలో సంప్రదాయంగా వస్తుంది. అయితే ఈ బోనాలను పురస్కరించుకొని ఈనెల 13న ఆదివారం గ్రామస్థులంతా బోనాలు వేయనున్నారు. దీంతో ఈపాటికే గ్రామ దేవతల ఆలయాలను శుద్ధి చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని పలు గ్రామాలలో కూడా అకాడి బోనాలు వేస్తున్నారు. కొన్ని గ్రామాలలో పోతరాజుల ఆటపాటలు, గ్రామ దేవతల నూతన విగ్రహాల ప్రతిష్ఠాపనలు కూడా చేయనున్నారు.



దంతన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ సోయం బాపురావు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● మాజీ ఎంపీ సోయం బాపురావు

ఉట్నూర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని మాజీ ఎంపీ సోయంబాపురావు అన్నారు. శనివారం ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో పేద ప్రజల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి పని చేస్తున్నారని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని అన్నారు. ఆయన వెంట టీపీసీసీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మొహమ్మద్‌ముబీన్, దొసండ్ల రాజేశ్, ఇందిరమ్మ లబ్దిదారులున్నారు.

అసైన్డ్ భూముల్లో మొరం అక్రమ తవ్వకాలు

● పట్టా ఉంది మాకేం కాదు అంటూ.. ఎక్స్‌కవేటర్ ఓనర్ ధీమా
● ఒక్కో ట్రాక్టర్‌కు రూ.200 ఇస్తున్నాం అంటున్న యజమానులు

తాంసిలో దేశీదారు జోరు

● గ్రామాల్లో మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతున్న వైనం
● రెట్టింపు ధరలకు మద్యం అమ్మకాలు
● అయినా పట్టించుకోని అధికారులు

వివరాలు 7వ పేజీలో......

● బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి వాగును దాటుతున్న గ్రామస్థులు



వరదొస్తే వణుకే..

వర్షాకాలం వచ్చిందంటే చాలు.. మారుమూల గిరిజన గ్రామాలకు వణుకు పుట్టిస్తుంది. చిన్నపాటి వర్షాలకే వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో చాలా గ్రామాలు బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నాయి. దీంతో వరద నీటిని దాటేందుకు ఆదివాసీ గిరిజనులు పడరాని పాట్లు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతియేటా గ్రామీణ రోడ్ల నిర్మాణానికి కోట్ల రూపాయల నిధులను ఖర్చు చేస్తున్న శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

- జిల్లా ఏజెన్సీలో అధ్వానంగా మారిన రహదారులు
- చిన్నపాటి వర్షాలకే ఉప్పొంగుతున్న వాగులు, వంకలు
- అత్యవసర సమయంలో ప్రమాదకరంగా ప్రయాణం
- వర్షాకాలంలో గోసపడుతున్న గిరిజన గ్రామాలు
- బ్రిడ్జిల నిర్మాణం కోసం తప్పని ఎదురుచూపులు

ఆదిలాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బి, ఐటీడీఏ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నా.. ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టక పోవడంతో గ్రామీణ రోడ్లన్నీ అతుకుల బొంతగా మారుతున్నాయి. ఏదైనా ఆపద వస్తే వరదనీటిని దాటడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. ప్రధానంగా ఇంద్రవెల్లి, సిరికొండ, నార్నూర్, ఉట్నూర్, బజార్‌హత్నూర్, గాదిగూడ, ఇచ్చోడ మండలాల్లోని మారుమూల గ్రామాల రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. అత్యవసర సమయంలో ఊరు దాటి బయటకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. వాగులపై లోతట్టు వంతెనలు, బ్రిడ్జిలు నిర్మించాలని ఏళ్ల తరబడి అధికారులకు మొర పెట్టుకుంటున్నా.. పట్టించుకోవడమే లేదని గిరిజనులు వాపోతున్నారు. అలాగే చినుకు పడితే చిత్తడిగా మారిపోతు న్న బురద రోడ్లపై నిత్యం ప్రయాణం చేయాలంటే నరకయాతన పడాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికీ రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా వానాకాలం సీజన్ లో ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచి పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆపదలో దేవుడే దిక్కు

వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో గిరిజన గ్రామాలు బాహ్య ప్రపంచానికి పూర్తిగా దూరమవుతున్నాయి. దీంతో

(తరువాయి 6వ పేజీలో...)



చిత్తడిగా మారిన నార్నూర్ మండలం మాలెపూర్ చిత్తగూడ గ్రామ రోడ్డు



ఈ ఫొటోలో ఉధృతంగా ప్రవహిస్తూ కనిపిస్తున్నది.. గాదిగూడ మండలం ఖడ్కి గ్రామ సమీపంలో గల లోలెవల్ వంతెన. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. రోజంతా పలు గ్రామాలకు రవాణా సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపడితే ప్రయాణికులకు ఇబ్బందులు దూరం కానున్నాయి. ఇలాంటి పరిస్థితే మరెన్నో మారుమూల గిరిజన గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గాలలో కనిపిస్తున్నాయి.



● ఉట్నూర్ మండలంలో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నర్సాపూర్(జె) వాగును దాటుతున్న గ్రామస్థులు

అధికారులకు మా బాధలు చెప్పినా పట్టించుకోవడం లేదు

: నైతం శకుంతల, కొత్తపల్లి, బజార్‌హత్నూర్ మండలం



వర్షాకాలంలో మా గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఇప్పటికే చాలాసార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదు. భంద్రేవ్‌వాగు ఉప్పొంగితే ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. గతంలో ఓ గర్భిణి వరదనీటిని దాటలేక నానా అవస్థలు పడింది. మంచంపై గ్రామస్థుల సహకారంతో ఆసుపత్రికి తీసుకెళ్లడం జరిగింది. వర్షాకాలంలో ఎడ్లబండే మాకు 108 వాహనంగా మారింది.

ప్రతిపాదనలు పంపించాం

: శివరాం, పంచాయతీ రాజ్, ఈఈ ఆదిలాబాద్



జిల్లాలో ప్రమాదకరంగా మారిన లోలెవల్ వంతెనలు వాగులపై బ్రిడ్జిలను నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే కొన్ని రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. పనులను ప్రారంభించాల్సి ఉంది. నిధులు మంజూరుకాగానే పనులను చేపడుతాం. కొత్తగా నిర్మించే బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణాని కి చర్యలు తీసుకుంటాం. భారీ వర్షాలు కురవడంతో రోడ్లు కోతకు గురవుతున్నా యి. మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

అక్రమ వసూళ్ల ముఠా గుట్టురట్టు

● మహారాష్ట్ర యవత్‌మాల్ కానిస్టేబుల్ సహకారంతో దందా ● 11 మందిపై కేసు, నలుగురి అరెస్టు.. పరారీలో కీలక నిందితులు
● డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తామని వాహనదారులకు బెదిరింపులు ● వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-మహారాష్ట్ర మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారిపై అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న ముఠాను జిల్లా పోలీసులు గుట్టురట్టు చేశారు. రహదారి మీదుగా అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనదారుల వద్ద బ్లాక్ మెయిలింగ్ దందాకు పాల్పడుతూ నిత్యం రూ. లక్ష లు వసూలు చేస్తున్నారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. దీనిపై నేరడిగొండ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా 11మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఇందులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.రహదారి మీదుగా వెళ్లే పశువుల వాహనాలను తనిఖీలు చేయడం, యజమానులు, డ్రైవర్ల పై బెదిరింపులకు దిగుతు డబ్బులు వసూలు చేయడం, కాదు కూడదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరింపులకు దిగడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఈ ముఠాలో మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లా కానిస్టేబుల్ సందీప్ అనే వ్యక్తి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించామన్నారు. అలాగే ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రోహిత్‌షిండే రౌడీషీటర్ ఇద్దరు కలిసి పశువుల అక్రమ రవాణా వాహనదారులను బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. నేరడిగొండ మండలం చేతన్ కుమార్, జంగిలిఅన్వేష్, ఆదిలాబాద్ పట్టణంలోని మాజార్, ఇచ్చోడకు చెందిన ఆనంద్ నలుగురు వ్యక్తులు సహకరించారని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దందాలకు పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ బండారి రాజు, నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్



అరెస్టు అయిన నిందితులు

● నిందితులు కోర్టుకు హాజరయ్యేలా సమన్లను జారీ చేయాలి

ఆదిలాబాద్ అర్బన్: జిల్లాలో నమోదైన ప్రతీ ఒక్క కేసులో నిందితులు కోర్టుకు హాజరయ్యే విధంగా సమన్లను జారీ చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శనివారం స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లాలోని కోర్టు డ్యూటీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోను నిందితులు తప్పించుకోవడానికి లేకుండా చూడాలన్నారు. కోర్టుకు హాజరు కాని వారిపై ఎన్‌బీడబ్ల్యులను తీసుకొని తగు చర్యలను చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతీ శనివారం సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వారం రోజులలో జరిగిన కేసుల దర్యాప్తు పురోగతిపై క్షుణ్ణంగా పర్యవేక్షించాలన్నారు. పోలీసు స్టేషన్ల వారీగా జరుగుతున్న ప్రతీ కేసుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కోర్టు డ్యూటీ అధికారులకు సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కోర్టు డ్యూటీ అధికారులకు నగదు రివార్డులను, ప్రశంస పత్రాలను అందజేసి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.

● సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తును పూర్తి చేయాలి

తమకు కేటాయించిన కేసులలో సక్రమంగా దర్యాప్తు నిర్వహించి పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. శనివారం జిల్లాలోని హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్సైలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వీలైనంత వరకు పార్ట్ 1, పార్ట్ 2, సీజర్ పంచనామ లాంటివి నిర్వహించి కేసులో దర్యాప్తు పూర్తి చేయాలన్నారు.స్టేషన్ అధికారులకు వీలైనంత వరకు తమ వంతు సహాయాన్ని అందజేయాలని సూచించారు. ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి అన్ని రకాలుగా శిక్షణ అందజేసి నిష్ణాతులను చేయడం జరుగుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

అర్హతకు మించి వైద్యం.. ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్

బోథ్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామంలో ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌ను శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ సీజ్ చేశారు. అర్హతకు మించిన వైద్యం నిర్వహించడంతో క్లినిక్ సీజ్ చేస్తున్నట్లు వైద్యాధికారి పేర్కొన్నారు. ఆర్‌ఎంపీల వద్ద వైద్యం తీసుకోవడం వల్ల కిడ్నీలు చెడిపోయే ఆస్కారం ఉందని వారిచ్చే వైద్యం సరైనది కాదని పేర్కొన్నారు. అంతేగాక వ్యాధులు ప్రబలిన వెంటనే స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి వివరించడంతో పాటు గ్రామస్థులకు వ్యాధులపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సబ్ సెంటర్‌ను తనిఖీ చేసి సిబ్బందికి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆయన వెంట జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ ఎం శ్రీధర్ స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



పొచ్చెర గ్రామంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

యాదవ భవన్‌లో గోరింటాకు సందడి

మావల, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవన్‌లో మహిళలు గోరింటాకుతో సందడి చేశారు. ఈ సందర్భంగా మహిళలు అందరికీ పండుగ వాతావరణంలో గోరింటాకు పెట్టుకున్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ గోరింటాకు చర్మ వ్యాధుల నుంచి రక్షిస్తుందని, ఒంట్లోని వేడిని తగ్గిస్తుందన్నారు. గోరింటాకు అనేది సాంప్రదాయకంగా, సౌందర్య సాధనంగా, అలాగే ఆరోగ్యపరంగా అనేక ఉపయోగాలు కలిగి ఉంది. గోరింటాకు జుట్టుకు బలాన్ని ఇవ్వడానికి, చుండ్రును తగ్గించడానికి ఉపయోగపడుతుంది. ఆషాఢ మాసంలో గోరింటాకు అలంకరణ తెలుగు వారి సంప్రదాయమని పలువురు మహిళలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.హేమలత, అర్చన, విజయ, కల్పన, రాధికా, రాధా రాణి, జ్యోతి, కవిత, గోదావరి, పెద్దసంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న మహిళలు

'కరెంట్ కోతలతో తప్పని ఇబ్బందులు'

బోథ్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ శాఖ అధికారులు ప్రజలను కరెంటు కోతలతో సతమతం చేస్తున్నారని బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ పేర్కొన్నారు. చిన్నపాటి గాలి దుమారానికి గంటల తరబడి కరెంటు పోతుందని, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పంట పొలాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున విద్యుత్ శాఖ అధికారులు వాటిని సరిచేయాలని కోరారు.



హాజరైన అధికారులు(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న పీవో ఖుష్బుగుప్తా)

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి : పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో కళాశాలల్లో మెనూ ప్రకారం గిరిజన విద్యార్థులకు భోజనం సమకూర్చాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, గిరిజన సహకార సంస్థ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు పౌష్టికరమైన ఆహారం అందించడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. గిరిజన సహకార సంస్థ ద్వారా ఆశ్రమ పాఠశాలలకు గురుకుల పాఠశాలలకు కళాశాలలకు సరుకులు సరఫరా చేయడం జరుగుతుందని, అయినా కూడా కొందరు వార్డెన్లు అక్కడక్కడ బహిరంగ మార్కెట్లో సరుకులు కొనుగోలు చేసుకుంటున్నారని అన్నారు. సమయం ప్రకారం విద్యా సంస్థలకు గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో సక్రమంగా సరుకులు సరఫరా చేయాలని సూచించారు. ఇప్పటికే విద్యా సంస్థలలో వంటకాల కోసం కావల్సిన వంట సామాగ్రిని పంపిణీ చేయడం జరిగిందన్నారు.వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటున్నందున విద్యా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదే అన్నారు. మలేరియా జ్వరాలు ప్రబలకుండా ఉండడానికి దోమల నిరోధానికి ఫాగింగ్ చర్యలు అన్ని విద్యాసంస్థల్లో చేపట్టాలన్నారు. విద్యా సంస్థల్లో సీఆర్టీల నియామకం, ఖాళీల అంశంపై సమీక్షించి అవసరమైన చోట ఏర్పాట్లు చేస్తామని అన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జీసీసీ డీఎం గుడిమల్ల సందీప్‌కుమార్, కొమురంభీం ఆసిఫాబాద్ డీడీ రమాదేవి, మంచిర్యాల డీటీడీఓ, ఏటీడీఓలు, జీసీసీ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్ నూతన ఎస్సైగా అఖిల్



బాధ్యతలను స్వీకరిస్తున్న అఖిల్

నార్నూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నార్నూర్ ఎస్సైగా కె.అఖిల్ శనివారం పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ మండలంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులకు సమన్వయం అందిస్తానని తెలిపారు. ప్రాంత ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించబోమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అంతేకాకుండా ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైకు పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

నేరడిగొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): బజార్హత్నూర్ మండలంలోని చందు నాయక్ తండా గ్రామానికి చెందిన పద్వాల్ పార్వతిబాయికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్, నేరేడిగొండ మండల కేంద్రంలో గల తన నివాసంలో అందజేశారు. సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

రిజర్వేషన్ల అమలు పట్ల హర్షం

● జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేయడం హర్షణీయమని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. కానీ కేంద్రం దాటవేసే ధోరణిలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ఆర్డినెన్స్‌ని తీసుకువచ్చి స్థానిక సంస్థల ఎన్నికలలో అమలు చేసి ఎన్నికలకు వెళ్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. బీసీలు రాజకీయంగా రాణించాలన్నారు. ఇందులో ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, మేకల అశోక్, నర్సింలు, నూటంకే సత్యనారాయణ, దొడ అశోక్, సామల ప్రశాంత్, సతీష్‌సింగ్, ఎన్నావార్‌రాజు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక కళాకారులను ప్రోత్సహించాలి

● మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తే అద్భుత ఫలితాలను సాధిస్తారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీ కల్యాణ మండపంలో దారుణం సినిమాను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన పలువురు యువకులు కలిసి సినిమాను రూపొందించడం అభినందనీయమన్నారు. దర్శక నిర్మాతలతో పాటు హీరో గణేష్ దేవుకాంబ్లె, హీరోయిన్‌గా శ్వేతపోతురాజ్‌లను అభినందించారు. దాదాపుగా ఏడాదిన్నర పాటు కష్టపడి సినిమాను రూపొందించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను రూపొందించాలని ఆకాంక్షించారు. ఇందులో జ్ఞానేశ్వదేవుకాంబ్లె, మనిషా దేవుకాంబ్లె, పసుల దేవిదాస్, పండ్ల శ్రీనివాస్, వాఘ్మారే ప్రశాంత్, గంగారెడ్డి, స్వామియాదవ్, తదితరులున్నారు.

మాదిగ కులస్థుల పెద్ద మనిషికి సన్మానం

ఉట్నూర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మాదిగ కులస్థుల పెద్ద మనిషిగా ఎక్సైజ్ కానిస్టేబుల్ కొల్లూరి లింగన్నను శనివారం ఎన్నుకుని ఘనంగా సన్మానించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని శాంతినగర్‌లో ఉన్న మాదిగ కులస్థుల కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనను ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగ కులస్థుల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి ముందు ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ముడుగు శామ్యూల్, కొల్లూరి రాజేందర్, బెరిగిడి మనోహర్, గంగన్న, అరికిల అశోక్, చొప్పదండి గంగన్న, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో లింగన్నను సన్మానిస్తున్న మాదిగ కులస్థులు

చారిత్రక సంప్రదాయాలను ఆచరించాలి

● కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ● ఘనంగా రేణుకా ఎల్లమ్మతల్లి పట్నాలు కార్యక్రమం

మావల, జూలై 12(ఆంధ్రజ్యోతి): మన చారిత్రక సంప్రదాయాలను తెలుసుకోవడంతో పాటు వాటిని ఆచరించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని బట్టిసవర్గాం గౌడ గీత కార్మిక సంఘం, దుబ్బగూడ గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ పట్నాలు కార్యక్రమాన్ని గత మూడు రోజులుగా ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మండలకేంద్రం



ఎల్లమ్మ తల్లి పట్నాల జోగు కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి

లోని ఆయన నివాసంలో జోగు పట్నాలు తిరగడం కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ విగ్రహానికి సాంప్రదాయ పూజలు నిర్వహించి ఎల్లమ్మ ఒగ్గు కళాకారులు నృత్యాలు చేస్తూ ఎల్లమ్మ కథను వినిపించారు. పూజాది కార్యక్రమాల్లో శ్రీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అంతరించిపోతున్న ఎల్లమ్మ ఒగ్గు కథలు, జానపద కళలకు జీవం పోసేలా ఆధ్యాత్మికతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి కరుణా కటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఎల్లమ్మ పట్నాల నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన అమ్మవారికి గంగా స్నానంతో ప్రారంభమై, 11, 12వ తేదీల్లో జోగు తిరగడం, ఆదివారం పోచమ్మ బోనాలు, సోమవారం జోగు తిరగడం, ఎల్లమ్మ బోనాలు గుడికి చేరడం జరుగుతుందన్నారు. 15వ తేదీన దుబ్బగూడలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ పెద్ద పట్నాం శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ మునిరాజు కళ్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాగరాజ్ గౌడ్, దేవేందర్ గౌడ్, సాయి చైతన్య గౌడ్, నరేష్ గౌడ్, రమేష్ గౌడ్ ఆదిలాబాద్ గౌడ కులస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెప్పినా ప్రారంభంకాని బస్సులు!

ఉట్నూర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో రవాణా సౌకర్యాలు తీసుకు రావాలని, కొత్త బస్సు రూట్‌లను ప్రారంభించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ చెప్పిన ఆర్టీసీ అధికారులు స్పందించక పోవడం పట్ల విస్మయం వ్యక్తం అవుతుంది. ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్ మీదుగా, కడెం ఖానాపూర్ మీదుగా నిర్మల్‌కు రెండు బస్సులను ప్రారంభించాలని, అదేవిధంగా ఇందన్‌పల్లి, కలమడుగు మీదుగా ఉట్నూర్ నుంచి జగిత్యాలకు, ఉట్నూర్ నుంచి ఉమ్మడి జిల్లాలోని జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్‌లకు బస్సు సర్వీసుల ఏర్పాటు చేసి గిరిజన ప్రాంతాల ప్రజలకు ఆర్టీసీ సేవలు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే ఆదిలాబాద్ డిపో మేనేజర్‌కు సూచించారు. ఎమ్మెల్యే చెప్పి పక్షం రోజులు దాటుతున్న ఇంకా బస్సులు ప్రారంభం కాలేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఉట్నూర్ డిపోలో బస్సు సర్వీసులను పెంచి ఏజెన్సీ ప్రాంతాలలోని రోడ్డు ఉన్న గ్రామాలకు బస్సు సేవలు ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఎమ్మెల్యే మరో సారి జోక్యం చేసుకుని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రితో మాట్లాడి కొత్త బస్సులను తెప్పించాలని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు.

బీసీలకు అండగా కాంగ్రెస్: ఆత్మ చైర్మన్

బోథ్, జూలై 12(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాల వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువచ్చేందుకు గాను 42 శాతం రిజర్వేషన్లు అమలుపరిచేందుకు కాంగ్రెస్ పార్టీ అధినాయకులు రాహుల్ గాంధీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో ధృడనిచ్చేయంతో ముందుకు సాగుతున్నారని ఆత్మ చైర్మన్ జి.రాజు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బి.గంగారెడ్డిలు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అంతకుముందు బస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నినాదాలు చేశారు. అనంతరం అక్కడే ఏర్పడిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి వెనుకబడిన వర్గాల ప్రజలకు అండగా ఉంటుందన్నారు. 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే భవిష్యత్తులో బీసీలు రాజకీయంగా ఎదుగుతారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబూద్ మహమ్మద్, నరసింహ, దాస్, జి.గంగాధర్, కురుమే రాజన్న, ఇంద్రారెడ్డితో పాటు పలు గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జమాడ పూసిగూడలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలి

● నార్నూర్, ఝరి ప్రభుత్వ వైద్య సిబ్బంది

నార్నూర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నార్నూర్, ఝరి ప్రభుత్వ వైద్య సిబ్బంది హెల్త్ సూపర్ వైజర్ లు చౌవాన్ చరణ్ దాస్, సంజయ్ ఆడె అన్నారు. శనివారం నార్నూర్ మండలంలో జమాడ, పూసిగుడ, గాదిగూడ మండలంలోని దాబా పునగూడ గ్రామాల్లో అర్ఎఫ్ఎస్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రోగాలు బారిన పడిన వారికి వైద్య చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. రోగాలు బారిన పడితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించాలన్నారు. ఎలాంటి సహాయం అవసరం ఉన్న అందుబాటులో ఆశ వర్కర్లు ఉంటారని వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వెంట సిబ్బంది సింధు,హెల్త్ అసిస్టెంట్ చవాన్ కైలాష్, సుజాత ఆశ, రత్న, కల్పన, ప్రకాష్ ఉన్నారు.

పాముకాటుతో గేదె మృత్యువాత

భీంపూర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన రైతు షేక్ జావిద్ గేదె ఎప్పటిలాగే శనివారం మేతకు వెళ్లింది. ఈ క్రమంలో పాము కాటు వేయగా అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధిత రైతు ఈ సందర్భంగా తెలిపాడు. కాగా ఈ విషయాన్ని తహసీల్దార్, వెటర్నరీ అధికారులకు సమాచారం అందించారు.



బజార్‌హత్నూర్ మండలంలో గిర్జాయి వాగును దాటుతున్న గిరిజనులు

వరదొస్తే వణుకే..

(5వ పేజీ తరువాయి...)

ఆపద సమయంలో దేవుడే దిక్కు అంటూ ఆదివాసీ గిరిజనులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. వరదనీటిని దాటలేక రోజుల తరబడి గ్రామాలకే పరిమితమవుతున్నారు. సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో కిలోమీటర్ల మేర కాలినడకనే ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఇప్పటికీ పల్లెవెలుగు బస్సు అంటే ఎరుగని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. అత్యవసర సమయంలో ఊరు దాటి రావాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. అలాగే ఎరువులను తరలించేందుకు అవకాశం కూడా లేకపోవడంతో పంటల సాగు అంతంతమాత్రంగానే కనిపిస్తుంది. అత్యవసర సమయంలో ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఎడ్లబండ్లపై ప్రమాదకరంగా వరదనీటిని దాటాల్సి వస్తుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టుతప్పితే ప్రమాదమే..

గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించే వరదనీటిలో నుంచి ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. వాగులు దాటే క్రమంలో పట్టుతప్పితే ప్రమాదం జరిగే పరిస్థితి కనిపిస్తుంది. ముఖ్యంగా ఇంద్రవెల్లి మండలంలోని చిట్యాబట్ట, జెండాగూడ, జైత్రంతండా, ఆర్కాపూర్, మామిడిగూడ గ్రామాలతో పాటు బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి, మోర్కాండి, ఉమర్ధా, బుద్ధునాయక్ తండా, మన్నాపూర్, ఉట్నూర్ మండలం నర్సాపూర్(జె), ఆడగూడ, వంకతుమ్మ, పాటగూడ, నార్నూర్ మండలంలో ఉమ్రి, చిట్టగూడ, సిరికొండ మండలాల్లోని పలు గ్రామాలకు వెళ్లే దారులు ప్రమాదకరంగా మారుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 25 కటాఫ్ గ్రామాలుగా గుర్తించిన అధికారులు లోలెవల్ బ్రిడ్జిలను నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వాగుల వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహించడంతో వరదనీటిని దాటే క్రమంలో ప్రయాణికులతో పాటు పశువులు నీటిలో గల్లంతవుతున్నాయి. గతంలో పలువురు వరదనీటిని దాటుతు ప్రాణాలు పోగొట్టుకున్న దాఖలాలు ఉన్నాయి. ప్రతి యేటా జిల్లాలో ప్రమాదాలు జరుగడం పరిపాటిగానే మారింది.

'శ్రీరామ గానామృతం' పుస్తకావిష్కరణ

తాంసి, జూలై 12(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో కవులు, కళాకారుల కృషి ఎంతో అభినందనీయమని పలువురు కళాకారులు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని వడ్డాది గ్రామంలో వెలసిన నరసింహ స్వామి ఆలయంలో భగవాన్ దాస్ రచించిన శ్రీరామ గానామృతం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు కబీర్ దాస్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం కోసం కవులు, కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రతీఒక్క వ్యక్తి ఏదో ఒక కలలో రాణించాలన్నారు. ఒక కవి సమాజం కోసం రచించే కవిత్వానికి ప్రజల్లో ఆదరణ రావాలంటే దాని ప్రాముఖ్యతను తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతీ వ్యక్తిలోని సృజనాత్మకత బయటకు రావాలంటే ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భజన మండలి జిల్లా అధ్యక్షుడు గడుగు గంగన్న, కేమ హనుమాన్లు, ద్యావరి గంగాధర్, తదితరులు ఉన్నారు.

ట్యాంకును శుభ్రం చేయించరూ..!



తాగునీటి ట్యాంక్ చుట్టూ పేరుకున్న నాచు

కుభీర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బట్టిగల్లీ హనుమాన్ ఆలయ సమీపంలోని తాగునీటి ట్యాంకు చుట్టు నాచు పేరుకుని అపరిశుభ్రంగా మారింది. దీంతో స్థానికులు ఆ ట్యాంకు నీటిని వినియోగించేందుకు జంకుతున్నారు. ట్యాంకు పక్క ఉన్న మురికి నీటి కాలువలోని పూడిక తొలగించకపోవడంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని తెలిసినా తాగునీటి ట్యాంకుల వద్ద క్లోరినేషన్ వంటి పనులు చేపట్టడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు.

జోగు రామన్నను పరామర్శించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్, జూలై12 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి జోగురామన్న అక్క భర్త యాసంగి పెద్దనర్సింగ్ ఇటీవల మరణించడంతో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆయనను పరామర్శించారు. శనివారం బేల మండలం చప్రాల గ్రామంలో మాజీ మంత్రి జోగురామన్నను కలిసి పరామర్శించారు. శనివారం నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని యాసంగిపెద్దనర్సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నేతలు, నిర్మల్ జిల్లా అధ్యక్షులు రాంకిషన్‌రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, తదితరులున్నారు.



అసంపూర్తిగా దార్‌కుభీర్ వంతెన నిర్మాణ పనులు

వంతెన పనులు పూర్తయ్యేదెన్నడో?

కుభీర్,జూలై 12 (ఆంధ్రజ్యోతి): వంతెన పనులు పూర్తి చేసి ఇరువైపులా రహదారి నిర్మాణం పూర్తి చేయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మండలంలో దార్‌కుభీర్, గ్రామశివారులో రూ.54లక్షల వ్యయంతో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. పనులు పూర్తిచేసి నెలలు గడుస్తున్నా రహదారి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వంతెనకు ఇరువైపులా పూర్తిస్థాయిలో మట్టి లేకపోవడంతో కురుస్తున్న వర్షాలకు ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉందని ప్రమాదాలు జరగక ముందే పనులు పూర్తి చేసేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఏపుగా పెరిగే.. నాటడమే మిగిలే!

● నాటేందుకు నర్సరీల్లో 5లక్షల మొక్కలు సిద్ధం ● రోడ్లు, ఖాళీ స్థలాల్లో నాటేందుకు పంపిణీ చేయనున్న అధికారులు



నాటేందుకు సిద్ధంగా ఉన్న మండల కేంద్రంలోని నర్సరీలో మొక్కలు

మొక్కలను నాటిస్తాం..

● సాగర్‌రెడ్డి, ఎంపీడీవో కుభీర్



మొక్కలు నాటేందుకు రహదారుల వెంబడి గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో ఈజీఎస్ కూలీలతో గుంతలను తవ్వించాం. గ్రామాల్లో ప్రతీ ఇంటికి ఆరు మొక్కలను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. మానవ మనుగడలో మొక్కల ఆవశ్యకత వివరిస్తూ ప్రతీఒక్కరు మొక్కలు నాటేలా అవగాహన కల్పిస్తున్నామన్నాం.

కుభీర్, జూలై12 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపుకోసం రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పంచాయతీ శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఏటా విధించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటుతున్నారు. వనమహోత్సవానికి నర్సరీలో మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఇందులో భాగంగా సిబ్బంది రోడ్ల వెంబడి ఖాళీ స్థలాల్లో నాటేందుకు ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేపడుతున్నారు. ఈసారి కూడా మండలంలోని ఆయా గ్రామాల్లో విరివిగా నాటేందుకు నర్సరీల్లో సిద్ధంగా ఉంచారు. వర్షాలు కురుస్తుండగా ఈ నెలలో నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

39 నర్సరీల్లో 5లక్షల పెంపకం

మండలంలోని 42 గ్రామ పంచాయతీలకు మూడు గ్రామపంచాయతీలు మినహా మొత్తం 38 పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. వీటిలో 5లక్షల మొక్కలను పెంచుతున్నారు. ప్రతీ నర్సరీకి సిబ్బందిని కేటాయించి సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. వనమహోత్సవం ప్రారంభమయ్యే వరకు అన్ని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచుతున్నారు. వేసవిలో ఒక్కటి కూడా ఎండిపోకుండానీటిని గ్రేస్‌మ్యాట్‌లను ఏర్పాటు చేశారు.

● నర్సరీల్లో పెంచుతున్న మొక్కలివే..

39 నర్సరీల్లో కానుగ, వేప, మహగన్ని, నేరేడు గులోమోను, టేకోమో, జామ, నిమ్మ, ఆశ్వగంధ, పచ్చగన్నేరు, ఈత మొక్కలతో పాటు మరో పది రకాల మొక్కలు పెంచారు. ఇప్పటికే రహదారులకు ఇరువైపులా ఖాళీ స్థలాల్లో ఉపాధికూలీలతో గుంతలు తవ్విస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా తేదీలు ప్రకటిస్తే మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి

సారంగాపూర్, జూలై12 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వర్ణ గ్రామంలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన రాజన్న కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులైన ఉట్ల రాజేశ్వర్‌ను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయనవెంట పారిశ్రామిక వేత్త అల్లోల మురళీదర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఐరా నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ అట్ల మైపాల్‌రెడ్డి, మాజీ అడెల్లి మహాపోచమ్మ దేవాలయం చైర్మన్‌లు మాధవ్‌రావు, ఐటి చందు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ్, నాయకులు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఐకే రెడ్డి

'ఆవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి'

నిర్మల్ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దేశీవాళి ఆవుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను సేవ్ దేశీ కౌస్ క్యాంపెనర్, క్లిమామ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యరెడ్డి కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ, క్రాస్ బ్రీడింగ్ దేశీవాళి ఆవులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, కృత్రిమ గర్భధారణ పద్ధతుల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సేవ్ దేశీ కౌస్ ప్రచారంలో భాగంగా శనివారం రాజ్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేశీవాళి ఆవుల సంరక్షణ కోసం చేపట్టిన ప్రచార కార్యక్రమాలను వివరించారు. విదేశాలకు చెందిన జెర్సీ హోలిస్టిన్ వంటి హైబ్రిడ్ జాతులతో కృత్రిమ



గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు దేశీవాళి ఆవుల సంరక్షణ గురించి వివరిస్తున్న దృశ్యం

గర్భధారణ వల్ల మన దేశీ ఆవు జాతులు ఎన్నో అంతరించి పోతున్నాయన్నారు. మన దేశమేలు రకమైన ఆవులను అమెరికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా లాంటి దేశాలు పెంచి పోషిస్తే మనం మాత్రం అధిక పాల దిగుబడి కోసం హైబ్రిడ్ జాతుల పోషణకు ప్రాధాన్యత ఇవ్వడంతో నాసిరకం పాలు మన పిల్లలకు ఇస్తున్నామని, ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయడానికి క్రాస్ బ్రీడింగ్ పద్ధతిని అరికట్టాలని, స్వదేశీ జాతుల అభివృద్ధికి కృషిచేయాలని అభ్యర్థించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గవర్నర్ దేశీవాళి ఆవుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని గవర్నర్ తెలిపారు. దేశీవాళి ఆవుల సంరక్షణ కోసం గత పది సంవత్సరాల నుంచి దివ్యరెడ్డి చేస్తున్న కృషిని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అభినందించారు.



లబ్దిదారులకు చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

భైంసారూరల్, జూలై12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగాం గ్రామంలో సీఎం సహాయ నిధి చెక్కులను ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పంపిణీ చేశారు. పాంగ్రి గ్రామానికి చెందిన బి. సత్యశీల అనే లబ్ధిదారుకి రూ.41వేల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. చెక్కు మంజూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు సూర్యకాంత్ రెడ్డి, బామిని రాజన్న, ఉత్తమ్, బాలేరావు, మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆకాష్, సాహెబ్ రావు, కే. సాయిప్రసాద్, దేవుజీ, శ్యామ్‌దాస్, నాగేష్, నాగేందర్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య



మృతుడు పవార్ సురేందర్ (ఫైల్)

కుంటాల, జూలై12 (ఆంధ్రజ్యోతి): కుంటాల మండలంలోని మెదన్‌పూర్ గ్రామానికి చెందిన పవార్ సురేందర్ (40) జీవితంపై విరక్తితో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై అశోక్ తెలిపారు. కుటుంబీకులు, పోలీసుల కథనం మేరకు సురేందర్ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం గడిపేవాడని ఇటీవల తాగుడికి అలవాటు పడి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది శనివారం సాయంత్రం ఇంటి ముందు రేకుల షెడ్డులో చీర కొంగుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతుడి తల్లి సుమన్‌బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

చెట్టును ఢీకొన్న బైకు.. ఒకరి మృతి



మృతుడు బోండా రవి (ఫైల్)

భైంసా రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో బైకు అదుపుతప్పి చెట్టుకు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అందకూర్ గ్రామానికి చెందిన బోండా రవి (23) శుక్రవారం రాత్రి తన మిత్రుడు పసుపుల మహేందర్ పుట్టినరోజు జరుపుకొని తిరిగి రాత్రి 1గంటకు అందకూర్ గ్రామం నుంచి భైంసాకు మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో తిమ్మాపూర్ గ్రామ సమీపంలో ఈదురుగాలికి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టుకు ఢీకొట్టడంతో తలకు బలమైన రక్తపు గాయమైంది. 108అంబులెన్స్ ద్వారా నిర్మల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తల్లి నీలబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై సుప్రియ తెలిపారు.

గాంధీభవన్‌లో అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే

ఉట్నూర్, జూలై12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గాంధీ భవనంలో అందుబాటులో ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో భాగంగా శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. సమస్యలను త్వరగా పరిష్కరించేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముథోల్‌ను మునిసిపాలిటీగా చేయండి

● ముథోల్ గ్రామస్థుల డిమాండ్ ● మునిసిపాలిటీతోనే పూర్తి అభివృద్ధి అంటున్న గ్రామస్థులు

ముథోల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీని మునిసిపాలిటీగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతీలో 5 వేల ఇళ్లు, 19,500లకు పైగా జనాభా సుమారు 10,570 ఓటర్లున్నారు. ప్రతియేటా పన్నుల రూపంలో సుమారు రూ. 30 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అయితే మునిసిపాలిటీగా ముథోల్‌ను ఏర్పాటు చేసినట్లయితే ముథోల్ అభివృద్ధి చెందుతుందన్న ఆశ ముథోల్ గ్రామ ప్రజల్లో ఉంది. ఇంతకుముందే ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీని మునిసిపాలిటీగా ఏర్పాటు చేయాలని గతంలో గ్రామ పంచాయతీలో తీర్మానం సైతం చేశారు. అలాగే ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు సైతం విన్నవించారు. కానీ నేటికీ కార్యరూపం దాల్చలేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ముథోల్ నియోజకవర్గం అంటేనే మొదట గుర్తుకు వచ్చేది ఈ నియోజకవర్గంలోని బాసర మండల కేంద్రంలోని జ్ఞాన సరస్వతి దేవి ఆలయం. అయితే ఈ ముథోల్ నియోజకవర్గంలోని భైంసా మున్సిపాలిటీతో పాటు ఏడు మండలాలు ఉన్నాయి. తాజాగా ముథోల్‌ను మున్సిపాలిటీ చేయాలన్న డిమాండ్ పెద్దగా వినిపిస్తుంది. ఎన్నో రోజులుగా ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీ మునిసిపాలిటీగా అవుతుందని స్థానికులు ఆశిస్తున్న అది నేటి వరకు కాలేదు. గతంలో మునిసిపాలిటీ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ వచ్చినప్పుడు గ్రామస్థులు, అధికారులకు ప్రజాప్రతినిధులకు, స్థానిక ప్రతినిధులకు ముథోల్ మునిసిపాలిటీగా ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని చీఫ్ సెక్రటరీ గతంలో సూచించారు. దీంతో మరోమారు ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీ మునిసిపాలిటీగా అవుతుందన్న ఆశలు చిగురించాయి. తప్పకుండా ముథోల్ మునిసిపాలిటీగా ఏర్పాటు చేయాలని ముథోల్ గ్రాస్థులు కోరుతున్నారు.

మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలి

ముథోల్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేసినట్లయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు పెరుగుతాయని క్రమం తప్పకుండా వచ్చే నిధులలో రూపురేఖలు మారుతాయి. పెరుగుతున్న జనాభా దృష్ట్యా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. దీంతో సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్ నిర్మాణం, పార్క్‌తో పాటు విశాలమైన రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వీధి లైట్లు తదితర అభివృద్ధి పనులు జరిగి పూర్తిగా ముథోల్ రూపు రేఖలు మారుతాయి. అయితే తాలూక కేంద్రం మున్సిపాలిటీగా అప్డేట్ అయితే అభివృద్ధి సాధిస్తుందని ముథోల్ గ్రామ పంచాయతీ వాసులు పేర్కొంటున్నారు. ముథోల్ ఇప్పుడిప్పుడే వ్యాపారపరంగా అడుగులేస్తుంది అని చెప్పుకోవచ్చు. ఇక్కడ ముథోల్ వ్యవసాయ పరిశోధన స్థానంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు రెసిడెన్షియల్



ముథోల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

ఉన్నాయి. అలాగే ఆసుపత్రి, పెంట్రోల్ బంకులు, బట్టలు, నగల దుకాణాలు, జనరల్ స్టోర్ కిరాణా ఇలా అన్ని వ్యాపార సముదాయాలున్నాయి. అంతేకాకుండా ముథోల్‌లోనే ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాఖ ఉండటంతో సుదూర ప్రాంతాల నుంచి ఎంతో మంది వైద్య సేవలు కోసం ఇక్కడికి వస్తుంటారు.

మునిసిపాలిటీతో అభివృద్ధి

- వెంకటాపూర్ రాజేందర్, తాజా మాజీ సర్పంచ్, ముథోల్



ముథోల్ అతిపెద్ద మేజర్ గ్రామ పంచాయతీ ఇది మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినట్లయితే అధిక నిధులు వస్తాయి. ముథోల్ పట్టణంలోని నెలకొన్న సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి. వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ విషయంలో రాజకీయ పార్టీల నాయకులు ప్రత్యేక దృష్టి సారించి మా గ్రామస్థుల కోరిక నెరవేర్చాలి. అధిక జనం ఉన్నందున పూర్తిస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమగు కనీస సౌకర్యాల కల్పనకు అస్కారం ఉంటుంది.

మునిసిపాలిటీతోనే అభివృద్ధి..

- లవన్ కుమార్, యువకుడు, ముథోల్



ఎన్నో ఏళ్ల నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే పెద్ద ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీ మునిసిపాలిటీ చేయాలని పలుమార్లు అధికారులకు, నాయకులకు వేడుకుంటున్నాం. ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీ కాబట్టి దీన్ని మునిసిపాలిటీగా చేసినట్లయితే ముథోల్ అభివృద్ధి చెందుతుందని మా ఆశ. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీని మునిసిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

ఆశావహుల చూపు.. రిజర్వేషన్‌ల వైపు!

● పోటీకి సై అంటున్న నాయకులు


సారంగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

సారంగాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నట్లు సోషల్ మీడియాలో రావడంతో గ్రామాల్లో రాజకీయ వేడి మొదలైంది. దీంతో గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో దిగేందుకు ఆశావహుల చూపంత రిజర్వేషన్‌లపై ఉంది. గత ప్రభుత్వం నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు కలిపి మొత్తం 50శాతం ఉండగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించే ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలనే బీసీలు డిమాండ్ కొనసాగుతుంది. దీంతో స్థానిక సంస్థల రిజర్వేషన్‌ల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా ఈ ఎన్నికల్లో రిజర్వేషన్‌లు ఏ విధం గా ప్రకటిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇటీవలే హైకోర్టు మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించడంతో స్థానిక రాజకీయాలపై ఆసక్తి ఉన్న ఆశావాహులు జరగబోయే ఎన్నికలకు ఇప్పటి నుండే సమయత్తమవుతున్నారు. ఈ ఎన్నికల్లో బరిలో దిగే ఆశావాహులు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మద్దతు కోసం దృష్టి సారిస్తూ ప ల్లెల్లో ఓటర్లను కూడ గట్టేందుకు గ్రామాలల్లో తమదైన శైలిని ప్రదర్శిస్తూ ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలను చేసుకుంటున్నారు.

● **గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ...**

గ్రామాల్లో అక్కడక్కడ నాలుగురు కలిసిన దగ్గర స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చలు జరుగుతున్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై చర్చించుకుంటూ తమ పార్టీ అభ్యర్థి గెలుపొందుతారని ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటూ గ్రామాలలో ఆయా పార్టీలు చేసినటు వంటి అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థులు గెలుపొందుతారో వేచి చూడాల్సిందే మరి అంటున్నారు.

● **అవకాశం వస్తే జడ్పిటీసీగా పోటీ చేస్తా..**

- కోర్వ నవీన్‌రెడ్డి(లాయర్) జాం



సారంగాపూర్ మండల జడ్పీటీసీ స్థానానికి రిజర్వేషన్ అనుకూలంగా వస్తే మండల జడ్పిటీసీ సభ్యునిగా పోటీ చేస్తా. కేఎన్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నాము. ప్రజలు తమ ఓటు ద్వారా జడ్పిటీసీగా అవకాశం కలిపిస్తే ప్రజలకు కేఎన్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతూ మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తా.

తాంసి మండలంలో దేశీదారు జోరు

● పట్టించుకునేవారే కరువు

తాంసి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాంసి మండలంలో దేశదారు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. నిత్యం లక్షల రూపాయల దేశిదారు విక్రయాలు జరుగుతున్న పట్టించుకునే వారే కరువయ్యారని అంటున్నారు. అక్రమ దేశిదారుకు అడ్డు కట్ట వేయాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేసిన పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది అంటి ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నరన్న ఆరోపణలు సర్వత్ర వ్యక్తమవుతున్నాయి. ఇటీవల తాంసి మండలంలోని అట్నంగూడా, లింబుగూడ గ్రామాల్లో దేశిదారు విక్రయిస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అయినప్పటికీ దేశదారు రవాణా విక్రయం ఆగడం లేదని అంటున్నారు. ముఖ్యంగా తాంసి మండలంలోని అట్నాంగూడా, లింబు గూడా, గిరిగావు, పాలోడి, సావర్గావ్, వడ్డాడి, జామిడి తదితర గ్రామాల్లో దేశదారును విక్రయిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తక్కువ ధరకు మహారాష్ట్ర నుంచి మద్యం కొనుగోలు చేసి రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారని అంటున్నారు. మహారాష్ట్రలో దేశదారు క్వార్టర్ ధర రూ. 70, అదే దేశదారును తాంసి మండలంలో విక్రయిస్తే క్వార్టర్ కు రూ. 100 నుంచి 120 రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. తాంసి మండల కేంద్రానికి నాలుగు ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఈ విక్రయాలు జరుగుతున్న ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో విక్రయాలు ఇలా ఉంటే తాంసి మండల సరిహద్దు ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు పెద్ద ఎత్తున రవాణా కూడా జరుగుతుందని అంటున్నారు. ఇకనైనా ఎక్సైజ్, పోలీసులు నిఘా పెడితే అసలు విషయం బయటకు వస్తుందని పలువురు అంటున్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు
- 4,800లు ఆన్‌లైన్ దరఖాస్తులు
- 6 వేలకు పైగా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు
- ఆయా కంపెనీలలో 800ల మంది ఎంపిక
- జాన్సన్ నాయక్‌ను కొనియాడిన ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్


ప్రారంభోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

ఖానాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జా బ్ మేళాకు విశేష స్పందన వచ్చింది. శనివారం పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు జిల్లాలోని పలువురు నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులతో ఖానాపూర్ బస్టాండ్ నుంచి ఏఎంకే ఫంక్షన్ హాల్ ప్రాంగణం వరకు కిక్కిరిసిన జనం కనిపించారు. మెగా జాబ్ మేళాకు ముఖ్య అతిథులుగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లు హాజరయ్యారు. జాబ్‌మేళాకు హాజరయ్యేందుకు వచ్చిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ మాజీ జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్ధన్, నిర్మల్ ఎఫ్ఏసీఎస్ మాజీ చైర్మన్ రామ్‌కిషన్ రెడ్డిలకు జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం జాన్సన్ నాయక్ నివాసం నుంచి ఏఎంకే ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. స్థానిక ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఇరువురు ఎమ్మెల్యేలు జాన్సన్ నాయక్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ జాన్సన్ నాయక్ నియోజకవర్గం ప్రజల కోసం శ్రమిస్తున్న తీరు అనిర్వచనీయమైనదన్నారు. ప్రజా సేవ చేసేందుకు పదవిలో లేకున్నా మంచి మనసుంటే చాలని జాన్సన్ నాయక్ నిరూపించారని కొనియాడారు. ఈ జాబ్ మేళాకు 4,800లు ఆన్‌లైన్ దరఖాస్తులు రాగా ఇంటర్వ్యూలకు 6,000కు పైగా అభ్యర్థులు హాజరైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. 60కి పైగా రాష్ట్రంలోని ప్రఖ్యాత కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్ మేళాలో 800ల మంది నిరుద్యోగులను ఆయా ఉద్యోగాలు పొందేందుకు అర్హత సాధించినట్లు తెలిపారు. 171 మందికి నేరుగా కంపెనీలు ఉద్యోగానికి సంబంధించిన ఆఫర్ లెటర్స్ అందజేశాయి. ఆయా విభాగాల్లో ఆయా కంపెనీలలో ఎంపికైన మిగతా వారికి కంపెనీ హెడ్ క్వార్టర్స్‌లో ఆఫర్ లెటర్స్ పొందేందుకు హాజరు కావాలని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

నా కట్టే కాలే వరకు ఖానాపూర్‌కే అంకితం..

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్

నా కట్టే కాలే వరకు జీవితాన్ని ఖానాపూర్ నియోజకవర్గం ప్రజలకే అంకిత చేస్తానని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్నారు. 20 ఏళ్లు సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్నానని నిరుద్యోగ యువతీ యువకుల సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించానన్నారు. రాజకీయాల్లో తొలిసారి పోటీపడిన తనను ఎమ్మెల్యేగా ఓడించినప్పటికీ ప్రజలు ఆదరించిన తీరును మాత్రం ఎన్నటికీ మరువలేనన్నారు. అందుకే ఖానాపూర్ నియోజకవర్గానికి ఇక్కడ నిరుద్యోగ యువతకి ఒక అన్నగా అండగా నిలిచేందుకు రాజకీయాలకు అతీతంగా మెగా జాబ్ మేళా కార్యక్రమానికి శ్రీకారం చుట్టానన్నారు. ఈ జాబ్ మేళాతో ఉద్యోగం పొందిన వారికి భవిష్యత్తులో ఏ విధమైన ఇబ్బందులు వచ్చినా ఒక అన్నగా అండగా ఉంటానన్నారు. జాబ్ మేళాకు హాజరైన సుమారు 2,000ల మంది లబ్ధిదారులు చిన్న చిన్న స్కిల్స్ లోపంతో ఎంపిక కాలేకపోయారని కంపెనీల నిర్వాహకులు తనకు తెలిపారన్నారు. కచ్చితంగా ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులలో స్కిల్ డెవలప్‌మెంట్ చేసేందుకు మండలాల వారీగా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేస్తానన్నారు. ఇకపై ఈ జాబ్ మేళా ప్రతీ ఏడాది జూలై 12వ తేదీన ఖానాపూర్ పట్టణంలో జరుగుతుందన్నారు. జాబ్ మేళాకు మూడు నెలల ముందు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచితంగా ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు సక్కారం శ్రీనివాస్, కల్వకుంట్ల నారాయణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపె శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ వాల్ సింగ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, జిల్లా నాయకులు కొక్కుల ప్రదీప్, గోరేకర్ రాజు ఉన్నారు.


జాబ్‌మేళా నిర్వహిస్తున్న పలు కంపెనీల ప్రతినిధులు


పిప్పల్‌దరి అడవి సమీపంలో జేసీబీ

అసైన్డ్ భూముల్లో అక్రమ మొరం తవ్వకాలు

● పట్టా ఉంది మాకేం కాదు.. జేసీబీ ఓనర్ ధీమా

● ఒక ట్రాక్టర్‌కు రూ.200 ఇస్తున్నాం అంటున్న యజమానులు

బోథ్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజులు వచ్చాయి అంటే స్థానిక జేసీబీ యజమానులు అటవీ సమీపంలో ఇష్టం వచ్చినట్లు తవ్వకాలు కొనసాగిస్తున్నారు. కొంతమంది జేసీబీ ఓనర్లు ముందుగా తీసుకున్న అనుకున్న ప్రకారం మొరం తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జెసిబి ఓనర్లు మొరం గుత్తేదారులుగా మారడంతో ప్రతిరోజు రాత్రిపూట మొరం తరలిపోతుండగా సెలవు రోజుల్లో రోజు పగలు అనే తేడా లేకుండా ఈ వ్యవహారం కొనసాగుతుంది.

● **సాగు చేసి జీవించాలంటే మొరం అమ్ముతున్నారు**

అటవీ సమీప ప్రాంతాల్లో కొంతమందికి ప్రభుత్వం గతంలో సాగు చేసుకుని జీవించాలంటూ అసైన్డ్ భూములను ఇవ్వడం జరిగింది. అయితే ప్రభుత్వం ఇచ్చిన భూములు సాగుకు యోగ్యం కావంటూ పట్టాదారులు అక్రమమురం వ్యాపారస్తులకు 200 రూపాయలకు ఒక ట్రాక్టర్ విక్రయిస్తున్నారు. అయితే మనం తగ్గుతున్న సమయంలో జేసీబీ యజమానులు సైతం మాకేం కాదు మేము పట్టా భూమిలో అంటూ అడిగిన వారికి జవాబు ఇస్తున్నారు. దీంతో మొరం వ్యాపారం అడ్డగోలుగా కొనసాగుతుంది.

వేంకటేశ్వర ఆలయంలో పూజలు

● పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత ● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా



బరంపూర్ వేంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో కుటుంబ సభ్యులు, ఆదిలాబాద్ అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

తలమడుగు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్త అన్నారు. శనివారం అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బ రంపూర్ కొండపై స్వయంభుగా వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా దీపక్ తివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ వేంకటేశ్వర ఆలయంలో అర్చన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ బరంపూర్ తిరుమల కొండలో ఆధ్యాత్మికం ఆహ్లాదం ఎంతో అభినందనీయమన్నారు. విశాలమైన వాతావరణం చుట్టుపచ్చని కొండలు మనసుకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. దిన దినం తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం అదిలాబాద్ అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కేదారేశ్వర రెడ్డి, పూజారి స్వస్తిక్ స్వామి కమిటీ సభ్యులు బి. మల్లేష్, రాజు, రమాకాంత్, రెవెన్యూ సిబ్బంది నరేందర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సవార్ల సందడి


చిన్నారులు తయారు చేసిన పీరీలు

తాంసి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు మొహరం వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. అయితే ప్రస్తుతం చిన్నారుల చిన్న సవార్ల సందడి సందడిగా మారింది. శని, ఆదివారాలు సెలవు దినాలు రావడంతో చిన్నారులు చిన్న పీరీలు ఏర్పాటు చేసుకొని ప్లాస్టిక్ డబ్బాల డప్పు వాయిస్తూ ఇంటింటికి వెళ్లి ఊరేగింపు నిర్వహిస్తున్నారు. దీంతో అచ్చం పెద్ద సవార్లను పోలిన మాదిరిగా కనిపించడంతో ఇంటికి వెళ్లిన చిన్న పీరీలకు కుటుంబ సభ్యులు పూజలు చేసి మొక్కలు తీర్చుకుంటున్నారు. అరుపులు, కేకలు, ఈలలు, టపాసులు కాలుస్తూ చిన్నారుల సందడి కనిపిస్తుంది. మండల కేంద్రంతో పాటు వడ్డాది, వామానగర్, కప్పర్ల గ్రామాల్లో కూడా చిన్నారుల చిన్న సవార్ల సందడి కనిపించింది.

ప్రయాణికుల కష్టాలు.. చెట్టుకు తెలుసు

● బస్టాండ్ లేక అవస్థలు

దిలావర్‌పూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అటు ప్రజాప్రతినిధులు, ఇటు ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో బస్టాండ్‌లో ఉన్న పెద్ద రావి చెట్టే ప్రయాణికులకు ఆశ్రయమిచ్చి, అక్కున చేర్చుకుంటోంది. 61వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ రావి చెట్టు ఎన్నో ఏళ్లుగా ప్రయాణికులకు నీడనిస్తోంది. మూడు కాలాలు ప్రయాణికులు చెట్టు కిందే నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. నిత్యం వందలాది మంది అటు నిర్మల్, ఇటు భైంసా వైపులకు ప్రయాణిస్తారు. వర్షం పడితే తడిచిపోవాల్సి వస్తోంది. మహిళా ప్రయాణికులైతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దిలావర్‌పూర్ మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలని కోరుతున్నారు.


చెట్టుకింద నిల్చొని బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు


మంత్రి కొండా సురేఖకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్


ఆర్జీయూకేటీలో మొక్కలు నాటుతున్న మంత్రి


బాసరలో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి

యాదాద్రిని తలపించేలా బాసర అభివృద్ధి

- వ్యాసమహర్షి తపస్సు చేసిన ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తాం
- రానున్న కృష్ణా, గోదావరి పుష్కరాల కోసం పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు
- త్వరలో ఆలయానికి రెగ్యులర్ ఈవోను, సిబ్బందిని నియమిస్తాం
- తమ ప్రభుత్వ హయాంలో విద్యా, ఉపాధి, వైద్య రంగాలకు అధిక నిధులు మంజూరు
- రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి
- బాసరలో వంద గదులు ధార్మిక వసతి గృహం, ఈవో కార్యాలయం నూతన భవనాల ప్రారంభం
- ఆలయంలో మంత్రుల పూజలు

నిర్మల్, జూలై12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని తలపించేలా బాసర పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్రమంత్రులు కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం బాసరలో పర్యటించిన మంత్రులు బాసర సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసమహర్షి తపస్సు చేసిన ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దామన్నారు. రాష్ట్రాల నుంచి తరలివస్తున్న భక్తులకు బాసరలో అన్నిసౌకర్యాలను కల్పిస్తామన్నారు. రానున్న కృష్ణా, గోదావరి పుష్కరాల కోసం పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపడతామని మంత్రులు స్పష్టంచేశారు. టీటీడీ ఆధ్వర్యంలో రూ.9.30కోట్ల వ్యయంతో మరమ్మతులు, నిర్మించిన 100 గదులు ధార్మిక వసతి గృహాలను, రూ.3.48 కోట్లతో నిర్మించిన ఈవో కార్యాలయం నూతన భవనాన్ని మంత్రులిద్దరు సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం బాసరలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. బాసర పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా మరుగుదొడ్లు, ఇతర వసతుల కోసం రూ. 40 లక్షలు, అదనంగా రూ.కోటి మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ ఏడాది సమ్మక్క - సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్న కృష్ణా, గోదావరి పుష్కరాల కోసం పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు భద్రతా ఏర్పాట్లకు నిధుల కేటాయింపునకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బాసర ఆలయానికి త్వరలోనే రెగ్యులర్ ఈవోను అవసరమైన సిబ్బందిని నియమించనున్నట్లు మంత్రులు వెల్లడించారు. పుష్కర ఘాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా అన్ని భద్రతా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు

బాసర పర్యటనలో మంత్రి కొండా సురేఖ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆంధ్రాలో గోదావరి పుష్కరాలకు నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో మాత్రం విస్మరించిందన్నారు. ఇప్పటికైనా తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు గోదావరి పుష్కరాలకు నిధులను మంజూరు చేయించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేంద్రం భాగస్వామ్యం అయ్యేలా నిధులు మంజూరు చేయించాలని కోరారు.

విద్య, వైద్య, ఉపాధి రంగాలకు నిధుల కేటాయింపు

రాష్ట్రంలో విద్య, వైద్య, ఉపాధి రంగాలకు ప్రభుత్వం నిధులను వెచ్చిస్తోందని కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బాసర పుణ్యక్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం పరిశ్రమల చర్యలు తీసుకుంటుందన్నారు. రైతు భరోసా, సన్న బియ్యం, నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయని వెల్లడించారు. విద్యారంగంలో పురోగతికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10వేల ఉపాధ్యాయులను నియమించామని వెల్లడించారు. కార్మికుల సంక్షేమం దృష్టిలో ఉంచుకొని ఉద్యోగ భద్రత, మినిమం వేజెస్ అందేలా చర్యలు చేపడతామన్నారు.

రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకపోతే.. బిచ్చమెత్తి అభివృద్ధి చేస్తా

- ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

బాసర పుణ్యక్షేత్ర అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఎన్నిసార్లు అడిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇక ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయకపోతే బిచ్చం ఎత్తి అయినా బాసరను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మాస్టర్ ప్లాన్ మరుగున పడిపోయిందని ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి మాస్టర్ ప్లాన్‌ను అమలు చేస్తే ఎంతో మంది దాతలు ఆలయ అభివృద్ధికి సహకరిస్తారని ఎమ్మెల్యే మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు.

బాసర ట్రిపుల్ ఐటీ అభివృద్ధిపై..

బాసర ట్రిపుల్ ఐటీ అభివృద్ధిపై మంత్రులు కొండాసురేఖ, వివేక్ వెంకటస్వామిలు స్పందించారు. బాసర ట్రిపుల్‌ఐటీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు ఉత్తమ వసతులు, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన విద్యావిధానం అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. దేశంలోని ప్రముఖ సంస్థలు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు ఈ యూనివర్సిటీ ప్రతిష్టతను పెంచుతున్నారని కొనియాడారు. యూనివర్సిటీలో ఎటువంటి సమస్యలు ఉన్న వాటిని తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మంత్రులకు ఘనస్వాగతం

బాసర పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామిలకు జిల్లా అధికార యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. ఉదయం బాసర ట్రిపుల్ ఐటీలోని హెలిప్యాడ్ వద్దకు మంత్రులు చేరుకోగానే కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల పూల మొక్కలను అందించి మంత్రులకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుండి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించేందుకు హాజరైన మంత్రులకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రులిద్దరినీ ఘనంగా సత్కరించారు. మంత్రులకు స్వాగతం పలికిన వారిలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఇతర అధికారులున్నారు.


బాసర ఆలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు


బాసర ట్రిపుల్ ఐటీలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కొండా సురేఖ


మంత్రికి సమస్యలను విన్నవిస్తున్న రమేష్

డిగ్రీ కళాశాలలో సౌకర్యాలపై మంత్రులకు వినతి

ముథోల్, జూలై12 (ఆంధ్రజ్యోతి): ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కనీస సౌకర్యాలను కల్పించాలని మండల బీజేపీ నాయకులు తాటివార్ రమేష్ రాష్ట్రమంత్రులకు వినతిపత్రం అందజేశారు. శనివారం బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి వచ్చిన దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, కార్మిక గనుల శాఖ మంత్రి వివేక్‌లకు కళాశాలను అభివృద్ధి చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. గతేడాది 2024 సంవత్సరంలో డిగ్రీకళాశాల ముథోల్‌కు మంజూరైందని, కళాశాలలో అడ్మిషన్ కోసం వీడీసీ సహకారంతో అడ్మిషన్లను చేశామన్నారు. ఈ డిగ్రీ కళాశాలకు పాత భవనం కావడంతో మరమ్మతులు, పెయింటింగ్ తదితర వాటికి వీడీసీ రూ2లక్షలు ఖర్చు చేశామని మంత్రుల దృష్టికి తెలియజేశారు. డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్, ఫిజిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్ విషయాలకు ఫ్యాకల్టీ కల్పించాలన్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది లేరని వివరించారు. విద్యార్థులకు తరగతి గదిలో అనుకూలమైన బోర్డులు లేవని, కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు డిగ్రీ కళాశాల విద్యుత్ కనెక్షన్లు సరిగా లేవని మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల మరుగుదొడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయని, మరమ్మతులు చేయించాలని, విద్యార్థుల సౌకర్యార్థం కోసం ఇంటర్నెట్ ఎంతో ముఖ్యమన్నారు. డిగ్రీకళాశాలలో వసతుల కోసం ఉన్నత విద్యాశాఖకు పలుమార్లు విన్నవించడం జరిగిందన్నారు. ముథోల్ డిగ్రీ కళాశాలకు నిధులను మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేయాలని మంత్రులను కోరారు.

సీనియర్ నాయకుడిని పరామర్శించిన ఎంపీ


మాట్లాడుతున్న ఎంపీ నగేష్

ముథోల్, జూలై12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తరోడా గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు నర్సాగౌడ్‌ను ఆదిలాబాద్ ఎంపీ జి. నగేష్ శనివారం పరామర్శించారు. నర్సాగౌడ్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ అతనిని పరామర్శించి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

అటవీశాఖ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్‌కి ఉద్యోగ భద్రత కల్పించాలి

- అటవీశాఖ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ కవ్వాల్ టైగర్ జోన్ శాఖ డిమాండ్

ఖానాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్‌కి ఉద్యోగ భద్రత కల్పించాలని అటవీశాఖ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ కవ్వాల్ టైగర్‌జోన్ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన అటవీశాఖ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ సమావేశానికి కవ్వాల్ టైగర్ జోన్ శాఖ హాజరైనట్లు ఆ శాఖ అధ్యక్షుడు స్వామి, ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులను రక్షించేందుకు గత 15 ఏళ్లుగా క్షేత్రస్థాయిలో తాము ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ఓవైపు చెట్లను స్మగ్లర్ల బారి నుంచి కాపాడమే కాకుండా మరోవైపు వన్యప్రాణులను వేటగాళ్ల బారి నుంచి సైతం కాపాడుతున్నామన్నారు. ఈ క్రమంలో ఎన్నోసార్లు స్మగ్లర్లు, క్రూరమృగాల దాడుల్లో తీవ్రంగా నష్టపోయామన్నారు. క్షేత్రస్థాయిలో పని ఒత్తిడిని తట్టుకోలేక పలువురు బీట్ ఆఫీసర్లు ఉద్యోగాలను వదిలి వెళ్లినప్పటికీ తాము అడవుల సంరక్షణకు తమ ప్రాణాలను అడ్డుగా పెడుతున్నామన్నారు. అంతగా శ్రమిస్తున్న తమను మాత్రం అటవీశాఖ, ప్రభుత్వం గుర్తించకపోవడం సమంజసం కాదన్నారు. అటవీ శాఖలో ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న తమకు ప్రతీనెల కేవలం రూ.10,032 చెల్లిస్తున్నారన్నారు. తమకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. రెండు మూడు నెలలకు ఒకసారి జీతాలను చెల్లిస్తున్నారని, ప్రతీనెల 1న జీతాలు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇన్నాళ్లుగా అవుట్ సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న తమను అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లుగా, బీట్ ఆఫీసర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పలు అంశాలపై జేఏసీలో చర్చించామని తమ డిమాండ్లన్నింటినీ సీఎం రేవంత్ రెడ్డికి విన్నవిస్తామన్నారు. హైదరాబాద్ తరలివెళ్లిన వారిలో అటవీశాఖ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కవ్వాల్ టైగర్ జోన్ నాయకులు ఇస్లావత్ రాజేష్, నాగవత్ రాజేష్, శంకర్, సాయి, విజేందర్, ప్రవీణ్, జయ్వంత్, తదితరులున్నట్లు వారు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

తానూర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన వడ్‌గాంలో చోటుచేసుకుంది. వడ్‌గాంలో జక్కాడి సమర్థ్‌కు చెందిన ఆవు శనివారం విద్యుత్‌షాక్ గురై మృతి చెందింది. గ్రామంలోని తన ఇంటి దగ్గర ఆవు మేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృత్యువా త పడింది. విద్యుత్ శాఖ అధికారులు అక్కడికి చేరుకొని మృతిచెందిన ఆవును పరిశీలించారు. పశువైద్యశాఖ అధికారులు పంచనామ నిర్వహి ంచారు. ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని ప్రభుత్వం తరుపున ఆర్థికంగా ఆదుకోవాలని రైతు అధికారులకు కోరాడు.


మృత్యువాత పడిన ఆవును పరిశీలిస్తున్న అధికారులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాలీ

రైతుపై దాడి చేసిన ముగ్గురిపై కేసు

నర్సాపూర్(జి), జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 9న ఓ రైతుపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై శనివారం కేసు నమోదైంది. జూలై 9న నర్సాపూర్(జి) గ్రామానికి చెందిన రైతు అమీన్ రమేష్‌రెడ్డి రాత్రి తన ఇంటి నుంచి పొలానికి వెళ్తుండగా షేక్ ముజానీర్, షేక్ మున్నా, మోహిన్ కలిసి ఏపీ 01 టీఏ 1514 నెంబర్ గల ఆటోలో గ్రాస్ బండిల్‌ను అనుమతి లేకుం డా ఆటోలో వేస్తున్నారు. దీన్ని గమనించిన రమేష్ రెడ్డి వారిని నిలదీశాడు. దీంతో రమేష్‌రెడ్డిని అసభ పదజాలంతో దూషిస్తూ కర్రలతో ఎడమ చేతిపై, వీపుపై దాడి చేశారు. అక్కడి చేరుకున్న రమేష్‌రెడ్డి కుమారుడు కార్తీక్ అడ్డుకోగా అతడిని సైతం అసభ్య పదజాలంతో దూషిస్తూ షేక్ ముజానీర్ తన సోదరుడు షేక్ మున్నాను పిలవగా అతను సైతం రమేష్ రెడ్డిపై కర్రతో దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ పట్టణ అధ్యక్షుడికి ఎమ్మెల్యే పరామర్శ

ఖానాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాలికి శస్త్రచికిత్స చేయించుకొని హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ పట్టణ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సన్నిహితుడు నిమ్మల రమేష్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ పరామర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి వెళ్లిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్ రమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. నిమ్మల రమేష్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు.

మురికివాడల్లోనే సర్కారు బడులు

పట్టణాల్లోని మురికివాడల్లోనే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగానే 20 మందికి పైగా పిల్లలున్న ప్రాంతం లో కొత్తగా బడులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే 20మందికి పైగా బడి ఈడు పిల్లలున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వెంటనే కొత్తగా బడులను ప్రారంభించాలని ఆదేశాలు సైతం జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇటీవల విద్యాశాఖ చేపట్టిన బడి బాట కారణంగానే ఈసారి అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి. ఉమ్మడి జిల్లాలో కొత్తగా 19 ప్రాథమిక పాఠశాలలను కొత్తగా మంజూరు చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.


- విద్యార్థులు యోగా చేస్తున్న దృశ్యం (ఫైల్)

- కొత్త కాలనీలకు ప్రాధాన్యం
- విద్యార్థులకు తప్పనున్న ప్రయాణ భారం
- సర్దుబాటు టీచర్లతో బడుల నిర్వహణ

ఉమ్మడి జిల్లాలో కొత్తగా 19 ప్రాథమిక పాఠశాలలు

నిర్మల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో మాత్రం ప్రభుత్వం ఈసారి కొత్త బడులను కేటాయించలేదు. అయితే మంచిర్యాల జిల్లాలో 14, నిర్మల్ జిల్లాలో 5 కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయబోతున్నారు. ప్రధానంగా అర్బన్ ప్రాంతాలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. కాగా మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లోని కొత్తగా ఏర్పాటు చేయబోతున్న 19పాఠశాలల్లో బడిబాటలోభాగంగా గుర్తించిన 1254 విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నారు. కొత్తగా పాఠశాలలకు సంబంధించి భవన సౌకర్యంతో పాటు ఇతర సౌకర్యాలను వెంటనే కల్పించాలని అలాగే అక్కడ వర్క్ అడ్జస్మెంట్ ద్వారా టీచర్‌లను డిప్యూటేషన్‌పై నియమించాలంటూ కూడా ఉన్న తాధికారులు ఆదేశాలు వెలువరించారు. కొత్త పాఠశాలల్లో డిప్యూటేషన్‌పై నియమించబోయే టీచర్ల జాబితాను కూడా సిద్ధం చేశారు.

నిర్మల్ జిల్లాకు ఐదు మంజూరు

నిర్మల్ జిల్లాలో కొత్తగా 5 పాఠశాలలను ఏర్పాటు చేయబోతున్నారు. ఇందులో నుంచి నిర్మల్ అర్బన్ ప్రాంతంలో రెండు, ఖానాపూర్‌లో ఒకటి కాగా, రూరల్ పరిధిలో భైంసా మండలంలోని బాబుల్‌గావ్, ఖానాపూర్ మండలంలోని రంగపేటలో కొత్తగా పాఠశాలలను ఏర్పాటు చేయబోతున్నారు. నిర్మల్ టౌన్‌లోని మహాలక్ష్మీవాడలో, అలాగే ఎల్లపెల్లి డబుల్‌బెడ్‌రూమ్ కాలనీలో, ఖానాపూర్‌లోని కొమరంభీమ్ చౌరస్తా వద్ద గల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు.


మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇదే..

మంచిర్యాలకు అధిక ప్రాధాన్యం

మంచిర్యాల జిల్లాలో కొత్తగా 14 పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌లో వార్డు నెంబర్ 23 హౌసింగ్ బోర్డ్ కాలనీ, వార్డు నెంబర్ 4 సుభాష్ నగర్‌లోను, మంచిర్యాల పట్టణంలోని వార్డు నెంబర్ 29 హైటెక్ సిటీ కాలనీ, వార్డు నెంబర్ 21 ఎల్ఐసీ కాలనీ, వార్డు నెం బర్ 31 గోసేవా మండల్ ప్రాంతంలో కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. లక్షెట్టిపేటలోని వార్డునెంబర్ 5 గోదావరి రోడ్ వీకర్ సెక్షన్‌లోను, వార్డు నెంబర్ 6 గొల్లగూడ మోదేల లోను, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో వార్డు నెంబర్ 17 బీజోన్ సెంటర్ పార్క్, వార్డు నెంబర్ 12 కాకతీయ కాలనీ, వార్డు నెంబర్ 4 నాగార్జున కాలనీ క్వార్టర్స్, వార్డు నెంబర్ 6 శేషపల్లి, వార్డు నెంబర్ 17 శ్రీనివాస్ నగర్‌లలో కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయబోతున్నారు. కాగా మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో వార్డు నెంబర్ 23 బుడదగూడెం, వార్డు నెంబర్ 4 పాకిస్తాన్ క్యాంపులలో కూడా కొత్త పాఠశాలలు ఏర్పాటు కాబోతున్నాయి. కాగా మంచిర్యాల జిల్లాలోని వార్డు నెంబర్ 31 గోసేవా మండల్ ప్రాంతంలో గుర్తించిన 225 మంది పిల్లల కోసం కొత్తగా బడిఏర్పాటు కాబోతోంది.

తగ్గనున్న వ్యయ భారం

కొత్త పాఠశాలల ఏర్పాటుతో ఇప్పటివరకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఇకనుంచి ఆ కష్టాలు తప్పనున్నాయి. నిర్మల్ జిల్లాలోని మహాలక్ష్మీవాడ, బంగల్‌పేట్‌లోని ప్రైమరీ పాఠశాలలు దూరంగా ఉండటంతో తమ పిల్లలను ఆటో రిక్షాలలోను సొంతంగానూ ప్రతీరోజు బడికి పంపిస్తున్నారు. ఇక నుంచి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోనే పాఠశాలఏర్పాటు కాబోతున్నందున విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

స్వచ్ఛందంగా పాఠశాల ఏర్పాటు

ఎల్లపెల్లి డబుల్‌బెడ్‌రూమ్ కాలనీ వద్ద తెలంగాణ ముస్లిమ్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా పాఠశాలను ఏర్పాటుచేశారు. జిల్లా కలెక్టర్‌తోపాటు డీఈవోసహకారంతో ముస్లిమ్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు తమ సొంత డబ్బులతో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్కులు ఇతర అన్ని సౌకర్యాలను కల్పించారు.

జిల్లాకు మంజూరైన ఐదు పాఠశాలలు

రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలో మరో ఐదు కొత్త ప్రాథమిక పాఠశాలలు మంజూరయ్యాయి. అయితే ఇందులో కొత్త కాలనీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నాం.